# గుగ్గుళ్ళమ్మ గుడి*

©2006 మహేష్ శనగల

"ఆకాశవాణి. ప్రత్యేక వార్తలు చదువుతున్నది విలేఖరి విస్సన్న. ఈనాటి ముఖ్యాంశం కృష్ణా జిల్లా గుగ్గుళ్ళ పల్లె లోని గుగ్గుళ్ళమ్మ గుడి" అంటూ మొదలయ్యింది ఆ రోజు ప్రత్యేక ప్రసారం. ఆలిండియ రేడియో నుండి సీయెన్నెన్ వరకూ అన్ని ప్రసార మాధ్యమాలూ గుగ్గుళ్ళ పల్లెలో మకాం వేశాయి.

"ఈ రోజు ఏం జరుగుతుందో, ప్రపంచమంతా ఎందుకు ఒకప్పుడు గొల్ల పల్లె అనబడిన ఈ పల్లెటూరిని తొంగి చూస్తుందో తెలుసుకోవాలంటే మనం ఒక ఐదేళ్ళు వెనక్కి, ఒంటరిగా వెళ్తున్న గీతమ్మతో పాటు విమానం ఎక్కి అమెరికా వెళ్ళాలి" అని ఫ్లాష్ బాక్ లో చెప్ప సాగాడు విస్సన్న.

---

కక్షలే లక్ష్యాలుగా బాంబుల్తో ఫుట్ బాల్ ఆడుకొనే ఫాక్షనిస్టుల నుండి, గత్యంతరం లేక గాభరాగా ఉరేసుకుంటున్న పేద రైతుల వరకు అందరూ చేతినిండా పని పెట్టడంతో, తన భార్యతో కలిసి అమెరికా వెళ్ళడానికి కుదర్లేదు సర్పంచ్ గిరి బాబుకి. నిజానికి ప్రయాణం రోజు గరం గజకేశవ రెడ్డి బాంబుల్ని సీమటపాకాయలుగా విసుర్తూ వెంటపడుతూ వేగంగా తరమక పోతే తన ఫ్లైటు మిస్సైపోయేది గీతమ్మ. అన్నీ మన మంచికే అనుకున్నారు గీతమ్మ, గిరి బాబు.

అదలా ఉంటే అమెరికాలో అడుగు పెట్టిన వెంటనే సరికొత్త సమస్య ఎదురయ్యింది గీతమ్మకి. అదీ మామూలు సమస్య కాదు. పుట్టబోతున్న తన తొలి మనవరాలిని పెంచడానికి యాభయేళ్ళ తన గతానుభవాలు పనికిరావని గీతమ్మతో విశదీకరించింది కోడలు గిరిజ. పసి కూనల్ని పెంచడంలో ఏమేమి చెయ్యకూడదో తన పీడియాట్రీషియన్ చెప్పిన విషయలన్నీ పూస గుచ్చినట్టు చెప్పింది.

"ఇదేమి చోద్యమమ్మా! వేలాది సంవత్సరాలుగా పెరగడం లేదా మనుషులు? పిల్లల్ని పెంచడంలో ఇప్పుడు క్రొత్తగా నేర్చుకునేదేముంది తల్లీ!" అంది గీతమ్మ.

"ఇవన్నీ మెడికల్ సైన్సు క్రొత్తగా కనుక్కున్న విషయాలు అత్త గారూ" అంది గిరిజ. "ఇంకా నా మాట మీద నమ్మలేక పోతే మీకు గూగుల్లో సెర్చి చేసి చూపిస్తా రండి" అని బెడ్ రూము నుండి క్రిందికి బయలు దేరింది తొమ్మిది నెలల నిండు గర్భిణి గిరిజ.

"ఇదేం వింత చెప్మా! గుగ్గిళ్ళూ, అలసందలు, పులవలు, బఠాణీలూ చూసి తెలుసుకునేదేముంటుంది!" అని లోలోనే అనుకుని కోడలి వెంటే స్టడీ రూములోకి వెళ్ళింది గీతమ్మ.

తిన్నగా కంప్యూటర్లో ఎదో టైప్ చేసింది గిరిజ. "దీన్ని గూగుల్ అంటారు అత్తయ్యా. దీంలో మనం దేన్ని గురించి వెదికినా సమాధానాలు దొరుకుతాయి."

"అంటే మన వూళ్ళో సోది చెప్పిచ్చుకున్నట్లా?" అని అనుమానంగా అడిగింది గీతమ్మ.

"అబ్బే దానికంటే శ్రేష్టమైంది అత్తయ్యా. ప్రపంచంలో ఉన్న విజ్ఞానమంతా క్షణాల్లో మీ ముందుంచుతుంది." అని కొన్ని పదాలు టైప్ చేసింది గిరిజ. వచ్చిన వేలాది లింకుల్లో కొన్ని చూపించి "ఇదిగో చూడండి ఈ డాక్టర్లు, మెడికల్ జర్నళ్ళలో బొమ్మలు గీసి మరీ పిల్లల్ని పెంచడం ఎలా అని చెబుతున్నారో."

"అలా మొదలైంది గీతమ్మకి గూగుల్ కి ముఖాముఖి" అంటూ ఆకాశవాణి ప్రత్యేక ప్రసారాన్ని కొనసాగించాడు విస్సన్న.

నొప్పి లేకుండా పురిటి నొప్పులు ఎలా పడొచ్చు, పిల్లల్ని ఎందుకు బోర్లా పడుకోపెట్టకూడదు, పసి పిల్లలకి స్నానం ఎలా చెయ్యించాలి వంటి విషయాలన్నీ గూగుల్ ద్వారా తెలుసుకుంది. గూగులే లేక పోతే ఏమి చేసేదాన్నో అని రోజుకు వందసార్లు అనుకునేది గీతమ్మ. అదే సమయంలో ఇంకా ఎన్నెన్నో విషయాలు గూగుల్ ద్వారా తెలిసుకుంది. ఆఖరికి సతీ అనసూయ ఇనప గుగ్గిళ్ళు వంటి పురాణ ఘట్టాలు కూడ గూగుల్ ద్వారా తెలుసుకోవచ్చని కనిపెట్టింది గీతమ్మ. ఇంతకు ముందు గ్రంధాలయాల్లోను, మేధావుల ఇళ్ళలోనూ దాక్కొన్న విజ్ఞానమంతా ఇప్పుడు అందరికి ఎక్కడయినా లభిస్తుంది అన్న విషయం వియూసీ వరకూ చదువుకున్న గీతమ్మకు పీహెచ్డీ చేసినంత కాన్ఫిడెన్సునిచ్చింది. కొడుకుని పీడించి తనకో బ్లాగు, వెబ్ సైటు పెట్టించుకుంది, పట్టుదలతో కంప్యూటర్ వాడడం నేర్చుకుంది.

------------------------------------------

ఆర్నెల్లు, అరవై వేల గూగుల్ సెర్చిల తర్వాత విజయవంతంగా గొల్లపల్లెకి తిరిగి వచ్చింది గీతమ్మ. గొల్లపల్లెలో ఎక్కడ వేసిన బాంబులు అక్కడే ఉన్నాయి. రౌడీ రాజకీయాలు మూడు కేసులు ఆరు హత్యలుగా వర్ధిల్లుతూనే ఉన్నాయ్. ఇంటికి

తిరిగొచ్చినందుకు తృప్తిగా ఉన్నా, ఈ అనాగరిక వ్యవహారాలన్నీ ఎప్పుడూ లేనంత ఇబ్బందిగా అనిపించాయి ప్రపంచం చుట్టి వచ్చిన గీతమ్మకి. ఐతే ఆడదాన్ని నాకెందుకు, నేనేమి చెయ్యగలనులే అని ఊరుకోవడం గీతమ్మ ఇంటా వంటా లేదు.

వచ్చిన తర్వాతి రోజే చుట్టుపక్కన ఉన్న అమ్మలక్కలందరికి గూగుల్ని పరిచయం చేసింది. గూగుల్లో తన పేరు టైప్ చేస్తే వచ్చిన తన వెబ్ సైట్ ని అందరికి గర్వంగా చూపించింది. ఉపగ్రహాలనుండి తీసిన తమ అగ్రహారాల బొమ్మలన్నీ సవివరంగా చూపించింది వాళ్ళకి.

"ఇదేదో నీ సరికొత్త సరదా కాస్త గ్రామానికి ఉపయోగపడితే బావుంటుంది కదే భార్యామణీ!" అన్నడు గిరి బాబు భోజనం చేస్తూ.

"ఆఁ, అదే ఆలోచనలో ఉన్నా నేను కూడా" అంది గీతమ్మ భర్తకి పెరుగు వడ్డిస్తూ.

ముందు అమ్మలక్కలతో మొదలైన గూగుల్ వాడకం, మెల్లగా గ్రామ ప్రజలందరికి ప్రాకింది. గిరి బాబు ప్రోద్బలంతో గ్రామ గూగుల్ సమితి ప్రారంభించింది గీతమ్మ. గ్రామానికి ఒక వెబ్ పోర్టలు, గ్రామస్తులందరకీ బ్లాగులు ఏర్పాటు చేసింది. గ్రామ పాలన, వ్యావసాయిక వ్యవహారాలు, ధాన్యం రేట్లు, సేంద్రీయ వ్యవసాయ విధానాలు, వగైరా అన్నీ గూగుల్ సెర్చిల ద్వారా తెలుసుకుని ఎప్పటికప్పుడు గొల్లపల్లె వెబ్ సైట్ నుండి అందరికి అందుబాట్లోకి తెచ్చింది. ఇదంతా కేవలం ఒక చోద్యంలా ఇకిలిస్తూ చూస్తున్న గరం గజకేశవ రెడ్డి వంటి రాజకీయ నాయకులు గ్రామంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పుల్ని గమనించలేక పోయారు.

ఉచితంగా చదువుకోవడానికి ప్రపంచంలో ఎక్కడెక్కడ స్కాలర్షిప్పు, గ్రాంట్లు లభిస్తాయో తెలుసుకుని గ్రామస్తులందరికీ అవకాశాలు కల్పించింది గీతమ్మ. ఓ అంతర్జాతీయ విశ్వ విద్యాలయం వారి ఇంటింటికీ ఒక కంప్యూటర్ స్కీము గురించి తెలుసుకొని తద్వారా అందరికీ కంప్యూటర్లు ఇంటర్నెట్టూ అందుబాట్లోకి తెచ్చింది. ప్రతి మహిళకి ఒక బ్లాగు ఏర్పాటు చేసింది. ఎవరికేమి కష్టాలున్నా ఇంటర్నెట్ మీద చెప్పుకోవడానికి వాయిస్ ఇంటర్ఫేస్తో, గొల్లపల్లె గ్రామీణ బ్యాంకు సహకారంతో "బడ్డీ కొట్లో బ్లాగు" స్కీం మొదలెట్టింది.

నేరస్తుల వివరాలు ఎప్పటికప్పుడు వెబ్ మీద అందరికి అందుబాటులో ఉండేలా పోలీసు

శాఖ వారితో ఏర్పాట్లు చేయించింది. చెయ్యకపోతే వారి డొంకతిరుగుడు వ్యవహారాలు ఎక్కడ వెబ్ మీద పడతాయో అన్న భయంతో వారు అంగీకరించక తప్పలేదు. తన ఫొటో ఆ నేరస్తుల లిస్టులో ప్రపంచమంతటికీ కనిపిస్తున్నదని తెలుసుకొనేంత వరకూ గరం గజకేశవ రెడ్డికి మెలకువ రాలేదు. కాని ఏం ప్రయోజనం! అప్పటికే గొల్లపల్లె నుండి గ్రీన్ లాండ్ వరకు వారి పేరు, అపఖ్యాతులు ప్రాకి పోయాయి, తర్వాతి ఎలక్షన్లలో నిలబడే అర్హతలూ పోయాయి! పంజా లేని పులిలా, సర్కస్ బోనులో సింహంలా అయిపోయింది గజకేశవ రెడ్డి వంటి ఫాక్షనిస్టుల పని. జైలునే ఇంటిగా చేసుకున్నారు వారిలో కొందరు. ఇంటినే జైలుగా చేసుకున్నారు మరి కొందరు. మా తాతలు బాంబులు వేశారు, మా చేతులు వాసన చూడండి అని కథలు చెప్పుకుంటున్నారు వారందరూ.

గ్రామంలో ఏ మూల ఏ మొగుడు తాగుడుకి అలవాటు పడినా అది పెళ్ళాం బ్లాగులో రాస్తుంది, వెంటనే గ్రామమంతటికి తెలుస్తుంది. మొన్నటికి మొన్న, వెంకాయమ్మ తన మొగుడు వీరయ్య తప్ప తాగి తనని కొట్టిన విషయం గురించి బ్లాగులో వ్రాయడం, గ్రామస్తులందరు వీరయ్యని పంచాయతీ పెట్టి నిలేయడం వెంట వెంటనే జరిగాయి. గాడిద మీద ఊరేగించడం పాత పద్దతి. గూగుల్ మీద వచ్చేలా "గొల్లపల్లె-గాడిద.కాం" లో ఫొటోలు, వివరాలు పెట్టి ప్రపంచామంతటా చాటడం, ఈ-మెయిలు లిస్టులో దండోరా వేయించడం ఈనాటి పద్దతులు. ఇంతకు ముందు దేవుడికి కూడా భయపడని వాళ్ళు ఇప్పుడు గూగుల్ కి దడుస్తున్నారు. ఒక దిన పత్రికలో అచ్చేయిస్తే ఒక ఊరిలోనో, ఒక రాష్ట్రంలోనో, ఒక దేశంలోనో తెలుస్తుంది. అదే సెర్చింజిన్లకు అందేలా వెబ్ మీద పెడితే ఉచితంగా ప్రపంచమంతా తెలుస్తుంది అన్న నిజం గ్రామస్తులకు ఒక ఆయుధంలా మారింది. హింసా రాజకీయాలు తగ్గాయి. సారాలు తాగి పెళ్ళాలని చితక్కొట్టే వాళ్ళు ఈ గ్రామం దరిదాపుల్లో లేరు. మొగుణ్ణి రాచి రంపాన పెట్టే పెళ్ళాలు భూతద్దంతో వెదికినా కనిపించడంలేదు.

ప్రపంచ దృష్టి గొల్లపల్లె మీద పడింది. గొల్లపల్లె ఒక ఆదర్శ గ్రామంగా మారింది.

ఈ స్పూర్తితో తెలుగు సినీ రంగం "సమరసింహారెడ్డి," "ఒక్కడు" వంటి సినిమాలు తియ్యడం ఆపి "అందరు," "ఒక్కతె," "ఉండమ్మా బ్లాగు పెడతా" వంటి సందేశాత్మక సినిమాలు మొదలెట్టారు. గీతమ్మ పేరు ప్రపంచమంతా మార్మోగిపోతోంది.

--------------------------------------------------

ఇహ మనం మళ్ళీ ఈ రోజుకు వస్తే, గొల్లపల్లెలో హడావుడి ఇప్పుడే మొదలవుతుంది.

దట్టమైన పొగ మంచు దూది పింజాలుగా గొల్లపల్లెని చుట్టుముట్టింది. దానికంటే ముందే

దూరదర్శన్ లు, సీయెన్నెన్లా వారి ప్రసార యంత్రాలతో ఊరిని చుట్టుముట్టాయి. ఉదయ సారంగ కిరణాలు బాణాలుగా ఆ పొగ మంచుని ఛేదించాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నాయి. విరగ కాసిన కొబ్బరి చెట్లు స్తంభించిన శివుడి జటా ఝూటాలుగా కొలను వడ్డున నిల్చున్నాయి. వాయు దేవుడు ఇంక నిద్దర్లేవలేదు. కలువల కొలను ప్రక్కన ఉన్న చిన్న గుడిలో గుగ్గుళ్ళమ్మ విప్లవ గీతాలు మైక్ లో హోరెత్తిస్తున్నాయి.

తమ జీవన రూపు రేఖల్ని సమూలంగా మార్చేసిన గూగుల్ని గ్రామ వాసులందరూ కలిసి మన పవిత్ర భారత సంప్రదాయంలో ఏకంగా ఆ గుడిలో ప్రతిష్ట చేశారు. ప్రాంతీయ భాషలో, ముద్దుగా, దానికి గుగ్గుళ్ళమ్మ గుడి అని పేరు పెట్టారు. గుడిలో దేవుడి బదులు ఒక శక్తివంతమైన, వాయిస్ ఇంటర్ఫేస్ ఉన్న మాట్లాడగలిగే కంప్యూటర్, వైర్లెస్ నెట్ వర్క్ కొన్ని కంపెనీలు బహుమతిగా ఇచ్చాయి. ఎవరైన, ఏ విషయమైనా, గుడికి వచ్చి అడిగితే వెంటనే సమాధానాలు దొరుకుతాయి. ఆటలమ్మ నుండి ఆటోలమ్మడం వరకు, బర్డ్ ఫ్లూ నుండి బడ్డీ కొట్టు అప్పుల వరకు అన్ని విషయాలూ గ్రామస్తులడిగి తెలుసుకుంటున్నారు.

---------------------------------------

"రండర్రా, త్వరగా తయారవ్వండి. ఫంక్షన్కి లేటవుతుంది!" ఐదేళ్ళ తన మనవరాలు గౌరికి జడ వేస్తున్న కోడలు గిరిజతో అంది గీతమ్మ రేడియో వింటూ.

రేడియోలో ఆనాటి ప్రత్యేకతను వివరిస్తూ ఆకాశవాణిలో విలేఖరి విస్సన్న గొంతు మెలో డ్రమాటిక్ గా వినిపిస్తుంది: "ఈ నాటి ఈ ముఖ్యమైన ఉత్సవాని కంటే గొప్ప విషయం ఈ నాటికి దారి చూపిన మహిళామణి గీతమ్మ గారి నాయకత్వం. ఈ నాటి నుండి ఈ ఊరి పేరు గొల్లపల్లె నుండి గుగ్గుళ్ళ పల్లెగా మార్చడానికి నిశ్చయించారు గ్రామస్తులు. ఈ యేటి నుండి మరి ఏటేటా ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన సందర్శకులందరిని ఇన్ స్పైర్ చేస్తుంది ఈనాడు మొదలవుతున్న ఈ గుగ్గుళ్ళపల్లెలోని గుగ్గుళ్ళమ్మ జాతర!" అంటూ కొనసాగింది ఆ ప్రసారం.

---------------------------------------------------------------------------------

*ఈ కథానిక కేవలం కల్పితం.

**గూగుల్ అన్నది google Inc. వారి ట్రేడ్ మార్కు.

Mahesh Senagala
244 Halcyon Place
San Antonio, TX 78209
210-824-1918
mahesh@mahesh.org